సీఎంతోనే సంక్షేమ పథకాలు సాధ్యం



రావులపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో లబ్ధిదారుని అభిప్రాయాలను పుస్తకంలో నమోదు చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



వాకలగరువులో ప్రజలకు జగనన్నే మా భవిష్యత్ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



మలికిపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు, వరప్రసాదరావు

రావులపాలెం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు నేడు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రజల మద్దతు ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం రావులపాలెం పంచాయతీ పరిధిలో ఒకటో వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పేరిట కొత్తపేట నియోజకవర్గంలోని లక్షా 5 వేల కుటుంబాలను పార్టీ సైనికులు కలవనున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఏం చేశారు, వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజలకు ఏం చేశారో చెప్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయం సేకరిస్తారన్నారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు ఏం గమనించారు అని అడిగే సాహసోపేతమైన కార్యక్రమం ఇది అన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి, ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలు అడిగి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని నమోదు చేస్తామన్నారు. మద్దతు తెలిపిన వారికి డోర్, మొబైల్ స్టిక్కర్లు అతికించడంతో పాటు వారి ఫోన్ నుంచి 8296082960 నంబర్‌కి మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరతామన్నారు. అనంతరం రావులపాలెం ఒకటో వార్డులో సచివాలయం–2 పరిధిలో కొన్ని గృహాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కొప్పన శివ, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి సందర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి వారి మద్దతు కోరారు. అలాగే ఐదు ప్రశ్నలు అడిగి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారు. వారి మొబైల్‌తో మిస్డ్‌కాల్ ఇవ్వమని సీఎం వాయిస్ రికార్డు కాల్ వినిపించారు. అలాగే ఇంటికీ, సెల్‌ఫోన్‌కు స్టిక్కర్లను ఎమ్మెల్యే స్వయంగా అతికించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, వార్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు అన్న నమ్మకం కలిగింది: ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: జగనన్నే తమ భవిష్యత్తు అన్న నమ్మకం ప్రజల్లో కలిగిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని శుక్రవారం నగరం గ్రామంలో ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి పార్టీ శ్రేణులతో గత ప్రభుత్వానికి, నేటి ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. చంద్రబాబు ఏ విధంగా ప్రజల్ని మోసం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి జగన్ ఏ విధంగా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలిచారన్న అంశాన్ని ప్రజలకు తెలియజేశారు. సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగి ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ జగనన్న పాలనే రావాలని చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, కుసుమ శ్రీధర్, కటకంశెట్టి ఆదిత్య, యూవీవీ సత్యనారాయణ, అన్వర్ తాహిర్ హుస్సేన్, సజ్జాద్ హుస్సేన్, నెల్లి దుర్గాప్రసాద్, చిక్కం బుజ్జిబాబు, కొమ్ముల శ్రీనివాస్, భూపతి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సభ్యుడి ఆధ్వర్యంలో..

అయినవిల్లి: అయినవిల్లి సచివాలయం–1, 2లో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 21 గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గృహసారథులు, వలంటీర్ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఉధృతం చేశారు. ప్రజల వద్దకు వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ పార్టీ స్టిక్కర్‌ను గోడకు అతికించారు. అలాగే మరో స్టిక్కర్‌ను సెల్‌ఫోన్‌కు అతికించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ప్రజాసమస్యలను మరింత లోతుగా తెలుసుకుని ప్రభుత్వ పాలనలో ప్రజలు కోరుకుంటున్న విధంగా మార్పులు చేయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వాకలగరువులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టిబాబు, నియోజకవర్గ పరిశీలకుడు కర్నాసుల సీతారామాంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో పాలన చేసిన ముఖ్యమంత్రులకు భిన్నంగా జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న ఆలోచనలతో ప్రజలకు మరింత మేలు చేయడానికి, సుపరిపాలన అందించడానికి సచివాలయ వ్యవస్థతో పాటు వార్డు, గ్రామ వలంటీర్లను నియమించారన్నారు. ప్రజల నుంచి మరింత విశ్వాసం పొందడానికి సమస్యలను సత్వర పరిష్కారానికి వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను పూర్తిగా తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించి 5 ప్రశ్నలను లబ్ధిదారులకు వివరించి వారి ఇంటికి స్టిక్కర్‌ను అతికించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు జెడ్పీటీసీలు బూడిద వరలక్ష్మి, గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వాకపల్లి శ్రీనివాసరావు, చప్పిడి రాజు, కడలి సుబ్రహ్మణ్యం, సిద్దాబత్తుల శ్రీనివాసరావు, కోలా లక్ష్మణస్వామి, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు: ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. శుక్రవారం మలికిపురంలోని చొప్పల వారి గ్రూపులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే రాపాక ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఆయన వివరించారు. జగన్ పాలనపై ఐదు ప్రశ్నలు వేసి ప్రజల నుంచి సమాధానాలు రాబట్టారు. సీఎం జగన్ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. సీఎం జగన్ పాలన చాలా బాగుందని ప్రజలు ముఖ్యకంఠంతో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ పాలన ప్రజల వద్దకు తీసుకెళ్లిన దేశంలో ఒకే ఒక్క సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. సంక్షేమ పథకాలు, జగన్ పాలనకు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ప్రతిపక్షాలు ఈర్ష పడుతున్నాయని పేర్కొన్నారు. జగన్ లాంటి నాయకులు రాష్ట్రానికి చాలా అవసరమని అన్నారు. జగన్ పాలనలో కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేలా ప్రభుత్వ పథకాలను రూపొందించి అమలు చేస్తున్న జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీరబ్రహ్మాజీరావు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మీమంగతాయారు, గెద్దం తులసీభాస్కరరావు, కోళ్ల వేణుప్రసాద్, రొక్కాల వెంకట్, చెవ్వాకుల విజయకుమార్, తాడి వర్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్

ఆలమూరు: పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు దిక్సూచిగా మారారని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ శ్రేణులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, గృహసారథులంతా సైన్యంలా వెళ్లి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ఉన్న ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ఇంటి యజమానుల అనుమతితో జగనన్న మా భవిష్యత్ స్టిక్కర్‌ను అంటించారు. ఈసందర్భంగా మానమ్మకం నువ్వే జగనన్న అంటూ గ్రామస్తులు ఆప్యాయత కురిపించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతోనే ప్రజల్లోకి వెళుతున్నాం



రావులపాలెం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రామాణికంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నేరుగా ప్రజల వద్దకు వెళ్లే కార్యక్రమాన్ని కొత్తపేట నియోజకవర్గంలో మొదలుపెడుతున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి అనేక సంవత్సరాలు అయినా, ఇప్పటి వరకూ ఏ నాయకుడు చేయని విధంగా సంక్షేమ పథకాలు డీబీటీ విధానంలో ప్రజలకు అందించిన ఏకైక ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నారు. ప్రజలకు అందిస్తున్న పథకాల ఫలితాలు ఎలా ఉన్నాయి? అవి ప్రజలకు చేరుతున్నాయా? అనేది నేరుగా ప్రజల వద్దకే వెళ్లి వారి అభిప్రాయాలు తెలుసుకునే విధంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు జగ్గిరెడ్డి వివరించారు. దేశంలోనే సుమారు 2 లక్షల కోట్లు డీబీటీ విధానంలో ప్రజలకు ఇచ్చిన ప్రభుత్వం మనదే అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఏడు లక్షల మంది కార్యకర్తలు ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో ఉన్న ఐదు కోట్ల మంది వద్దకు వెళ్లి ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయం సేకరణ చేయడంతో పాటు ఈ పథకాలు కొనసాగించాలా? లేదా అని అడుగుతారన్నారు. ఏడో తేదీన మొదలు పెట్టిన కార్యక్రమం 20 తేదీతో ముగుస్తుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గృహసారథులు చేసిన సర్వే, సేకరించిన రిపోర్టు వివరాలు వెల్లడిస్తామన్నారు. ప్రతిపక్షాలకు ఏం మాట్లాడాలో తెలియక అవాస్తవాలు, అసత్యప్రచారాలు చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ఏం చేసిందో కాగితం రూపంలో ప్రజలకు ఇవ్వడంతో పాటు రాజకీయ పార్టీలు, కులం, మతం చూడకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. అందుకు తమ కార్యకర్తలు ప్రతి ఇంటి తలుపుతూ తట్టగలుగుతున్నామన్నారు. అదేవిధంగా ప్రతిపక్షాలు తమ పాలనలో చేసి పనులు కాగితరూపంలో ప్రజలకు ఇవ్వగలరా అని ప్రశ్నించారు. మా పాలన నచ్చితేనే మాకు ఓటు వేయండి అని అడుగుతున్న నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్యప్రచారాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజల వద్దకు వెళ్లి ఇంత పెద్ద ఎత్తున అభిప్రాయ సేకరణ చేయడం దేశం చరిత్రలో కేవలం వైఎస్సార్ సీపీ మాత్రమే చేస్తుందన్నారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కొప్పెన శివ, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, ఆత్రేయపురం జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబా, దేవరపల్లి సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జగన్‌పై అచంచలమైన నమ్మకం



నగరంలో నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు అచంచలమైన నమ్మకం ఉందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా నగరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడారు. జగన్ సారథ్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటున్నాయన్నారు. సంక్షేమ పథకాల ఫలాలు అనుభవిస్తున్న ప్రజలు వైఎస్సార్ సీపీకి బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాటను జగన్ ఎక్కడా తప్పలేదని చిట్టిబాబు గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఎంతో కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేశారన్నారు. రహదారుల ఆధునికీకరణ, అప్పనపల్లి ఎత్తిపోతల పథకం, ఊడిమూడిలంక వంతెన నిర్మాణం, పి.గన్నవరంలో ఫైర్ స్టేషన్ మంజూరు, పాశర్లపూడిలంకలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరయ్యాయని చిట్టిబాబు చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, గన్నవరపు శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్లు నక్కా కృష్ణవేణి, వేటుకూరి వెంకట్రావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్లు వాసంశెట్టి చినబాబు, నక్కా వెంకటేశ్వరరావు, మట్టపర్తి శ్రీనివాస్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు తోలేటి బంగారునాయుడు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



ఎమ్మెల్యే రాపాక చేతుల మీదుగా చెక్కు తీసుకుంటున్న జాన్

సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన గెడ్డం జాన్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.లక్ష విలువైన చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పంపిణీ చేశారు. కత్తిమండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ఈ మేరకు జాన్‌కు అందజేశారు. కాగా అనారోగ్యంతో ఉన్న జాన్‌కు వైద్య ఖర్చులు నిమిత్తం పై మొత్తం మంజూరైంది. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, నల్లి ప్రేమానందం, కె.రాకేష్ పాల్గొన్నారు.

మానవాళి కోసం శిలువపై బలియాగం



పలివెలలో శిలువ ప్రదర్శన నిర్వహిస్తున్న ఫాదర్ అంథోని, క్రీస్తు భక్తులు



అంతర్వేది సెయింట్ మేరీస్ చర్చిలో మెయిన్ రోడ్డుపై శిలువతో పాదయాత్ర చేస్తున్న పాస్టర్



మామిడికుదురులో శిలువను మోస్తున్న ఫాదర్ రాజేష్

కొత్తపేట/అంబాజీపేట/మామిడికుదురు/సఖినేటిపల్లి/పి.గన్నవరంలమూరు: ఈ లోకంలో మానవాళి రక్షణకోసమే ఏసుక్రీస్తు తన ప్రాణాన్ని శిలువపై బలిగా అర్పించారని స్థానిక ప్రవచన దేవుని సంఘం, యెరూషలేము చర్చి పాస్టర్ అబెద్నగో అన్నారు. గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని గ్రామ గ్రామాన క్రైస్తవులు జరుపుకొన్నారు. క్రైస్తవ ప్రార్థనా మందిరాలైన చర్చిలలో ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. దానిలో భాగంగా స్తానిక పినిపేవారిపేట ప్రవచన దేవుని సంఘం, యెరూషలేము చర్చి పాస్టర్ బిషప్ అబెద్నగో ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. మండలంలోని పలివెల రోమన్ కేథలిక్ చర్చి తరఫున గ్రామ పురవీధుల్లో 'బహిరంగ శిలువ ప్రదర్శన' పేరుతో ఊరేగింపు నిర్వహించారు. చర్చి వద్ద ఈ ఊరేగింపును ప్రముఖ క్రైస్తవ మతబోధకుడు రెవరెండ్ ఫాదర్ కొడిదల ఆంథోని ప్రారంభించారు. కార్యక్రమంలో మండలంలో వివిధ గ్రామాల పాస్టర్లు, సంఘ పెద్దలు, గురువులు, విశ్వాసులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం పరిశుద్ధ మార్కు లూథరన్ చర్చిలో పేరిష్ పాస్టర్ రెవ గోరింకల నవరత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, కీర్తన, ధ్యానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అంబాజీపేట మండలంలోని ఇరుసుమండ సెయింట్ జోసఫ్ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ వినయ్‌సాగర్ మాట్లాడుతూ మండుటెండలో శిలువపై వేలాడుతూ క్రీస్తు పలికిన ఏడు మాటలు మానవాళికి ఆశీర్వాదకరంగా ఉన్నాయన్నారు. అనంతరం ఏసు క్రీస్తు శిలువారాధనను ప్రతిబింబించేలా గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో గీతాలాపనలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుడితి సత్యనారాయణమ్మ, మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న, సంఘ పెద్దలు పాల్గొన్నారు. మామిడికుదురు మండలంలో సకల జనుల పాప పరిహారార్థం శిలువపై ఏసుక్రీస్తు బలిదానం అయిన సందర్భాన్ని పురస్కరించుకుని గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలోని 18 గ్రామాల్లో ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కూడికలు జరిగాయి. సమస్త మానవులను పరిశుద్ధులుగా చేసేందుకు ఏసుక్రీస్తు శిలువపై బలిదానం అయ్యారని ఫాదర్ పి.రాజేష్ పేర్కొన్నారు. శిలువ ఊరేగింపులో సేవకులు జి.జయకుమార్, గాబ్రియేల్, కె.మోషే, జగదీష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సఖినేటిపల్లి మండలంలోని అంతర్వేది ఐపీపీ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. యేసును స్తుతిస్తూ వారంతా ఈ ప్రార్థనలు చేశారు. అంతర్వేది సెయింట్ మేరీస్ చర్చి పరిధిలో గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని చర్చి పాస్టర్ ఆధ్వర్యాన నమూనా శిలువను భుజంపై ధరించి గ్రామ పురవీధుల్లో ఆయన పాదయాత్ర చేశారు. అయనను క్రైస్తవులు, సంఘ విశ్వాసులు అనుసరించారు. పి.గన్నవరం మండలంలో క్రీస్తు భోదనలను అందరూ ఆచరించాలని నాగుల్లంక శివారు పెదకందాలపాలెం న్యూజెరూసలెం మినిస్ట్రీస్ అధినేత జి.దానియేలు అన్నారు. ఎస్‌జేఎం చర్చిలో దానియేలు ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ఆరాధన కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. మినిస్ట్రీస్ కార్యదర్శి యు.జాన్‌బాబు, గ్రేస్ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ ఎస్.శ్రీచరణ్, పాస్టర్ కరుణ్‌కుమార్, అబ్రహం, అగస్టిన్, లాసరస్ జోసఫ్, అధిక సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు. ఆలమూరు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలు జరుపుకొన్నారు. పాపులైన సమస్త మానవాళి రక్షించేందుకు శిలువ ధరించిన రోజు కావడంతో ఆమేరకు మత ప్రార్థనాలయాలు హల్లెలూయ స్తోత్రాలతో మార్మోగిపోయాయి. భక్తులందరూ ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రేమ, దయ, కరుణ, జాలి కలిగి ఉన్న మానవులను మరింత ఉన్నత స్థితికి చేరుస్తాయన్న క్రీస్తు బోధనలను అందరూ ఆచరించాలని మత ప్రబోధకులు కోరారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంబాజీపేట: ముక్కామల సబ్‌స్టేషన్‌లో పరిధిలో ఉన్న గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. ముక్కామల, వక్కలంక, పసుపల్లి రోడ్డు వైడినింగ్ పోల్స్ జరిపే పని నిమిత్తం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఎ.హరిబాబు కోరారు. ముక్కామల జెడ్పీ హైస్కూల్‌కు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

ఘనంగా బంగారమ్మ, మావుళ్లమ్మ తీర్థం

అంబాజీపేట: ఇసుకపూడి గ్రామంలో వేంచేసిన బంగారమ్మ, మావుళ్లమ్మ అమ్మవార్ల తీర్థాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా గ్రామ ఆడపడుచులు అమ్మవారికి ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు సమర్పించి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి నిర్వహించిన అమ్మవార్ల జాతరలో గరగ నృత్యాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

షష్టమ వార్షిక బ్రహ్మోత్సవం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు వేంకటేశ్వరస్వామి ఆలయంలో షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆలయ నిర్వాహకులు వేడుకగా నిర్వహిస్తున్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామికి నిత్యోపాసన, బలిహరణ, ఉత్సవాంత స్నపనం, ఐశ్వర్య ప్రాప్తికి సకల సౌభాగ్యాలకు అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు, లక్ష్మీకటాక్షం కోసం తామర పద్మాలతో ఐశ్వర్య లక్ష్మీ హోమం నిర్వహించారు. స్వామి దివ్యతేజస్సు కోసం మూలమంత్ర ప్రధాన హోమం, లక్ష్మీనృసింహ సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో వేంచేసిన బీబీ నాంచారీ సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి శ్రీపుష్పోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ఖండవిల్లి లక్ష్మీ నారాయణాచార్యుల ఆధ్వర్యంలో అన్నాబత్తుల వీరన్న, విజయలక్ష్మి పుణ్య దంపతులతో పూజలు జరిగాయి. ముత్తయిదువలకు పసుపు, కుంకుమ, జాకెట్లు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సీహెచ్ చిట్టిబాబు, గ్రామస్తులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

అంబాజీపేట: మాచవరం శివారు పోతాయిలంక పాములరావిచెట్టు వద్ద ఉన్న సీతారామాలయలం వద్ద శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నసమారాధ నిర్వహించారు. అంతకుముందు రాములవారికి ప్రత్యేక పూజలు చేశారు. సీతారాములను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థాన చైర్మన్ చప్పిడి రాజు తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

బాలాజీని దర్శించుకున్న రైల్వే సేఫ్టీ ఆఫీసర్

మామిడికుదురు: సౌత్ సెంట్రల్ రైల్వేశాఖ సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ జె.శ్రీనాథ్ కుటుంబ సభ్యులతో శుక్రవారం అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామిని దర్శించుకున్న అనంతరం అర్చకుల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆయనకు స్వామి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే

అంబాజీపేట: ప్రస్తుత విభిన్న వాతావరణంలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉందని తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి వి.గౌతమి, సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ నినాదించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనల్లో ముస్లింలు

మామిడికుదురు: పవిత్ర రంజాన్ నెల మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. దీనిలో భాగంగా స్థానిక స్థానిక షియా జామియా మసీదు, సున్నీ జామియా మసీదుల్లో అధిక సంఖ్యలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. పవిత్రమైన రంజాన్ నమాజుల్లో ప్రతి ముస్లిం అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొనాలన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కొత్తపేట: పవిత్ర రంజాన్ పురస్కరించుకుని ముస్లింలకు స్థానిక పారిశ్రామికవేత్త కె.రాము ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ మాసంలో ముస్లింలకు ముస్లిమేతరులు ఇఫ్తార్ విందు ఇవ్వడం సంప్రదాయం. దీనిలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక కమ్మిరెడ్డిపాలెం మసీదులో రాము ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. విందు స్వీకరించిన ముస్లింలు రాముకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా జరిగింది. కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత ఆధ్వర్యంలో ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆర్.సుదర్శన్‌బాబు, పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు నిర్వహించిన ఈకార్యక్రమాన్ని ఎంపీపీ, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి ప్రారంభించారు. జిల్లా వైద్యశాఖ ఆదేశాల మేరకు వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించి ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. సీహెచ్‌ఓ పి వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ పింఛన్ పంపిణీ

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కొరటి వెంకటరాజుకు నూతనంగా మంజూరైన డయాలసిస్ పింఛన్ రూ.10 వేలను స్థానిక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరితో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం పింఛన్ అందించి వారిని ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల బాబులు, చెల్లుబోయిన సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నేతలు పాలమూరి గోపాల్, బొరుసు పండు, బాలం రమేష్, రొక్కాల వెంకట్రావు పాల్గొన్నారు.

దాతల సహకారంతో షెడ్డు నిర్మాణం

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంతో పాటు వెలుపల రేకుల షెడ్డు నిర్మాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి నరసింహాచార్యులు పర్యవేక్షణలో శుక్రవారం భూమి పూజ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మేడిద శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయం లోపల, వెలుపల భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో రూ.10 లక్షలతో రేకుల షెడ్డును నిర్మిస్తున్నామన్నారు. ఆలయ షెడ్డు నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నయినాల ప్రభాకర్, మేడిద చిన్న, రవణం హరిబాబు, మేడిద సత్యనారాయణ, పరసా సత్తిబాబు, రవణం రాము, వీరా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శికి సన్మానం

అయినవిల్లి: అమలాపురం బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన బడుగు భాస్కర జోగేష్‌ను పలువురు సన్మానించారు. ఈ సన్మానంలో వెలువలపల్లిలోని భాస్కర్ జోగేష్ ఇంటి వద్ద నిర్వహించారు. సన్మానంలో వక్కలంక బుల్లియ్య, గుమ్మడి వెంకటేశ్వరరావు, చుట్టుగుళ్ళ కిషోర్, చిన్నం బాలవిజయరావు, కాకర బాబ్జీ తదితరులు ఉన్నారు.

మహిళను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఆత్రేయపురం: మండలంలోని లొల్లలాకుల వద్ద ఒక మహిళను ఢీకొట్టి గాయాలు పాలైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. లొల్ల లాకుల వద్ద ఆత్రేయపురం గ్రామానికి చెందిన జుత్తుగ గౌరమ్మ జ్యూస్ వ్యాపారం చేసుకుని సామాన్లు సర్దుతుండగా రావులపాలెం నుంచి రాజహేంద్రవరం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో గాయాలయ్యాయి. ఆమెను రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు మాతృవియోగం

ఆత్రేయపురం: సీనియర్ వైఎస్సార్ సీపీ నేత, ఏఎంసీ మాజీ చైర్మన్ ముదునూరి రామరాజు తల్లి ముదునూరి వెంకట సుబ్బాయమ్మ (93) గురువారం సాయంత్రం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వచ్చి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. అలాగే అంతిమ యాత్రలో పాల్గొన్నారు. నియోజక వర్గంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అభిమానులు వెంకట సుబ్బాయమ్మ మృతదేహనికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత సీఐపై కేసు

పి.గన్నవరం: తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని కోడలు ఇచ్చిన ఫిర్యాదుతో పి.గన్నవరానికి చెందిన విశ్రాంత సీఐ దొంగ రామ సత్యనారాయణపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.గంగాభవాని తెలిపారు. మూడో కుమారుడు జేషపాణి, కోడలు సత్యకుమారిలు గత ఐదేళ్లుగా రామ సత్యనారాయణ ఇంట్లో నివసిస్తున్నారని ఆమె వివరించారు. గతంలో భర్త ఇంట్లో లేని సమయంలో కోడలిని లైంగికంగా వేధించేవాడన్నారు. నెల రోజుల క్రితం రామసత్యనారాయణ భార్య మరణించారు. ఈ క్రమంలో గత నెల 30వ తేదీ రాత్రి తన భర్త జేషపాణి హైదరాబాద్ వెళ్లిన నేపథ్యంలో మామ రామసత్యనారాయణ తనను లైంగికంగా వేధించడంతో తప్పించుకుని పారిపోయినట్టు కోడలు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని మామ కోడలిని బెదిరించాడన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన భర్తకు విషయం చెప్పి, పెద్దల్లో అడుగుదామని నిర్ణయించుకునే సరికి రామసత్యనారాయణ పరారీ అయ్యాడని ఎస్సై వివరించారు. కోడలు సత్యకుమారి ఫిర్యాదు మేరకు రామసత్యనారాయణపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.